చెట్ల తోలు తీసి గొంతు కోస్తున్నారు!



లింగాలఘణపురం-నెల్లుట్ల రోడ్డులో భారీ చెట్టు చుట్టూ తొలగించిన బెరడు



బెరడు తొలగించడంతో ఎండిపోయిన చెట్లు

- బోషకాలు అందక ఎండుతున్న వృక్షాలు

లింగాలఘణపురం: పిల్లలు తల్లిదండ్రుల మాట వినకపోతే తోలు తీస్తాం.. తాటా తీస్తాం అంటుంటారు.. మరి మానవ మనుగడకు జీవనాధారమైన చెట్ల తోలు తీస్తూ వాటి గొంతుకోసినంత పని చేసి ఎండిపోయే విధంగా చేస్తున్నారు. భారీ వృక్షాలు రోడ్డు పక్కన ఉంటే తమ పంట పొలాల్లో చెట్ల నీడపడి పంటలు సరిగా పండడం లేదని గుట్టుచప్పుడు కాకుండా కాండం మొదట్లో చుట్టూ బెరడు (తోలు) కట్ చేస్తున్నారు. దీంతో వేర్ల నుంచి చెట్టుకు అందే నీరు.. పోషకాలు అందక కొన్ని రోజులకు ఆ చెట్లు ఎండిపోతున్నాయి. అంతేకాకుండా ఆ చెట్లు ఎండిపోయి ఎప్పుడు విరిగి ఎవరిమీద పడతాయోననే ప్రమాదకరంగా మారుతున్నాయి. లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల-లింగాలఘణపురం రోడ్డులో మల్లన్నగుడి సమీపంలో రోడ్డు పక్కనున్న భారీ వృక్షాలను రైతులు ఇదే విధంగా తోలు కట్ చేసి ఎండిపోయే విధంగా చేస్తూ తమ పంటలో చెట్ల నీడపడకుండా చూస్తున్నారు. ఈ విషయం ఎవరికి అర్థం కావడంలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా అంతగా దృష్టి పెట్టడంలేదు. దీంతో ఏళ్ల క్రితం నాటిన భారీ వృక్షాలు ఇలా ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

క్లుప్తంగా

అయ్యప్ప సేవా సమితి ట్రస్ట్ కార్యవర్గం ఎన్నిక



కొడకండ్ల: కొడకండ్ల హరిహర పుత్ర అయ్యప్ప సేవా సమితి ట్రస్ట్ కార్యవర్గాన్ని ఎన్నుకుని మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చైర్మన్‌గా శ్రీపాద ఆంజనేయులు, వైస్ చైర్మన్లుగా దూలం సతీష్‌గౌడ్, సిలువేరు యాకయ్య, మెరుగు సోమేశ్వర్ , జనరల్ సెక్రటరీగా మామిడి మల్లయ్య, కోశాధికారిగా కారుపోతుల దయానంద్‌గౌడ్, పబ్లిసిటీ కార్యదర్శిగా పనస రాజుగౌడ్, జాయింట్ సెక్రటరీగా కదారి ఉమేష్‌చంద్ర, సలహాదారులుగా పసునూరి మధుసూధన్, పేరం రాము, సభ్యులుగా కోట సత్యనారాయణ, ధరావత్ భీమా, మార్గం వంశీకృష్ణ, విశ్వనాధుల జ్ఞానేశ్వరచారి, తాతరబోయిన మహేష్, శివరాత్రి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మండలకేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై ప్రారంభించిన అయ్యప్ప ఆలయాన్ని ఏడాది కాలంలోనే పూర్తి చేసి ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్మించాలనే సంకల్పంతో ముందుకు సాగుతామని, ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించి భాగస్వాములు కావాలని ట్రస్ట్ నూతన కార్యవర్గం కోరింది.

టీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా మోహన్

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కోలుకొండకు చెందిన పాము మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ నియమాక పత్రాన్ని అందజేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో నియమాక పత్రాన్ని అందుకున్న ఆయన స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ పద్మశాలిల అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తన నియమానికి సహకరించిన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బాలరాజు, సామల పరమేశ్వర్, నల్ల యాదగిరి, సత్యనారాయణ, కాముని శ్రీనివాస్, మామిడాల రమేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సంయుక్త కార్యదర్శిగా రమేశ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా సుధాకర్

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన పెనుగొండ రమేశ్‌ను తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ మేడారపు సుధాకర్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా రమేశ్, సుధాకర్ మాట్లాడుతూ పద్మశాలిల అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

మీడియా కార్యదర్శిగా కృష్ణమూర్తి


రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి రాష్ట్ర పద్మశాలీ సంఘం మీడియా కార్యదర్శిగా నియామకం అయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజకుమార్ మంగళవారం కృష్ణమూర్తికి నియామకపు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలను చైతన్యం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

'సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి'



జనగామ రూరల్: ఈనెల 22వ తేదీన చేపట్టనున్న పట్టు రైతుల రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ పట్టు రైతు సంఘం రాష్ట్ర బాధ్యుడు మూడు శోభన్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో పట్టు రైతులను ఆయన కలిసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో వాటి పరిష్కారం కోసం ఆందోళనలు పోరాటాలు రూపొందించుకోవడానికి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పట్టు రైతుల పెండింగ్ ఇన్సెంటివ్‌లు తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమ్మేళనానికి ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దండ రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజకానున్నట్లు తెలిపారు. పట్టు రైతులు శ్రీధర్, భూక్యా చందు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

అర్చకులకు వేతనాలు పెంచాలి



జనగామ: రాష్ట్రంలో దూప దీప నైవేద్య అర్చకులకు వేతనాలు పెంచాలని కోరుతూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు శ్రవన్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ములుగు రామలింగ ఆరాధ్య మంగళవారం వినతిపత్రం అందజేశారు. అర్చకుల సేవలను దృష్టిలో ఉంచుకుని వేతనాలు పెంచే విధంగా కృషి చేయాలని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

- రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట రాజయ్య



సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జనగామ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని రిటైర్డ్ ప్రొఫెసర్ తాటికొండ వెంకట రాజయ్య కోరారు. మంగళవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగులు చేస్తున్న సమ్మె న్యాయమైనదని, ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయవాది జక్కుల కృష్ణ, తెలంగాణ రాష్ట్ర పండిత పరిషత్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.క్రాంతి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు శేషు కుమార్, తెలుగు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు, సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు తాడూరి రమేశ్, దయాకర్, రవీందర్, శ్రీలత, శ్రీనివాస్, అన్నపూర్ణ, రాణి, సుకన్య, రజిత, సునీత, జ్ఞానానందం, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆలయ అభివృద్ధి



ధర్మకర్తలతో చైర్మన్ శ్రీధర్‌రావు

- చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు

చిల్పూరు: అందరి సహకారంతో బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి పాటుపడుదామని, ఈ విషయంలో దాతల సాయం ముఖ్యమని ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట ఆలయ ప్రాంగణంలో మంగళవారం ధర్మకర్తలతో మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహాయ, సహకారాలను అందిస్తూ దాతలను భాగస్వాములను చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించుకోవాలన్నారు. దీంతో పాటు గుట్టపై కాలక్షేప మండపం, సులబ్ కాంప్లెక్స్, అన్నదాన సత్రంతో పాటు భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే పనులపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ధర్మకర్తలు గోలి రాజశేఖర్‌గుప్త, గనగోని రమేశ్, చల్లా వెంకటరమణాదేవి, తాళ్లపల్లి బుచ్చయ్య, పుల్యాల నారాయణరెడ్డి, భూక్య శ్రీనివాస్, రత్నాకర్‌రెడ్డి, వేముల వెంకటేశ్వర్లు, పులికాశిరాజయ్య, మోతె మహేష్, కొలిపాక రాజు, ఎడమ అశోక్, చెట్కూరి రవి పాల్గొన్నారు. కాగా, ఆలయ అభివృద్ధికి వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన చల్లా వెంకటరమణాదేవి–రాజమహేందర్‌రెడ్డి రూ. 1,00,016, మల్కాపూర్ గ్రామానికి చెందిన పుల్యాల నారాయణరెడ్డి రూ.50,016 విరాళం అందజేస్తామని ప్రకటించారు. అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, గోలి రాజశేఖర్ ఉన్నారు.

'దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిద్దాం'



దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ: భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిద్దామని తుల ఉమ, అరుణోదయ కళాకారులు విమలక్క, కడకంచి శ్రీనివాస్, దొడ్డి కొమురయ్య సినిమా జిల్లా చైర్మన్ బాల్దె మల్లేశం, దర్శకుడు సేనాపతి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బాల్దె మల్లేశం కురుమ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య సినిమా ప్రచార ర్యాలీని నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ రోడ్డులోని కొమురయ్య విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం వారు సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సాయుధ పోరాటంలో ప్రజల పక్షాన నిలబడ్డ దొడ్డి కొమురయ్య ప్రాణాలను అర్పించారన్నారు. ఆయన చిత్రాన్ని వెయ్యి మంది సహ నిర్మాతలు రూ.కోటి బడ్జెట్ చిత్రీకరిస్తున్నారన్నారు. ఈ సినిమా ప్రపంచ చరిత్రలో సంచలనం కాబోతుందన్నారు. అనంతరం తులిప్స్ ఫంక్షన్ హాల్‌లో సినిమా సహ నిర్మాతలను ఘనంగా సత్కరించారు. కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహ, మరికంటి భూమన్న, పర్వతాలు, కౌన్సిలర్లు కర్రె శ్రీను, పేర్ని స్వరూప, షేక్ అబ్దుల్ రహ్మాన్, మొల కలపల్లి లక్ష్మి చౌదరి, మురళి కృష్ణ చారి, ధరావత్ రామచందర్ నాయక్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

విరాళం



పాలకుర్తి: మండలంలోని గూడూరు జెడ్పీఎస్ఎస్ పాఠశాల అభివృద్ధికి అర్జుల రాంరెడ్డి రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను బాల్య స్నేహితులు మంగళవారం సన్మానించారు. 1996–1997 పదో తరగతి బ్యాచ్‌లో చదువుకున్న రాంరెడ్డి పాఠశాల అభివృద్ధికి నిధులను సేకరించారని డాక్టర్ చుక్కా రామయ్య ఫౌండేషన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య తెలిపారు. మడత రవీంద్రుడు, బెల్లి సంపత్, ఐరేని శైలజ పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా కమిటీ



జనగామ రూరల్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా నూతన కమిటీని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా బీటుకూరు శేషుకుమార్, ప్రధాన కార్యదర్శిగా గుర్జకుంట స్వరాజ్, మహిళా కార్యదర్శిగా లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షులుగా కే.శ్రీనివాస్ బాబు, వనజాత, ఎం.రవి, కార్యవర్గ సభ్యులుగా సరిత, అశోక్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి తిరుమల, కాంతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

బీఆర్ఎస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నాయకులు, కార్యకర్తలు పలు మండల కేంద్రాల్లో నిరసన తెలిపి అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, చిత్రహింసలకు గురిచేసి కోర్టుకు తరలించే క్రమంలో బేడీలు వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: నిరసన తెలుపుతున్న నాయకులు



తరిగొప్పుల: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



దేవరుప్పుల: కామారెడ్డి గూడెంలో..



నర్మెటలో..

విద్యారంగ సంక్షేమానికి కృషి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్



టీఎస్‌యూటీఎఫ్‌లో చేరుతున్న శ్రీనివాస్

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో విద్యారంగ సంక్షేమానికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి టీఎస్‌యూటీఎఫ్ అహర్నిశలు కృషి చేస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రంజిత్‌కుమార్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న జఫర్‌గడ్ మండలం సూరారం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం మెంతుల శ్రీనివాస్ టీఎస్ యూటీఎఫ్‌లో చేరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాష్, శ్రీనివాస్, రాజు, భానుప్రకాష్, కృష్ణమోహన్, పిట్టల మహేందర్, కనకయ్య, ఫకీర్‌దాస్, నాగరాజు, స్రవంతి పాల్గొన్నారు.

అభినందనీయం



జనగామ రూరల్: పుట్టిన రోజు సందర్భంగా శ్రీరాం శ్రీనివాస్ 37వ సారి రక్తదానం చేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు అన్నారు. మంగళవారం జనగామ మిలీనియం క్లబ్ పూర్వ అధ్యక్షుడు, శ్రీరామ్ శ్రీనివాస్ 54వ పుట్టినరోజు సందర్భంగా వీవర్స్ కాలనీలోని ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణం వద్ద నాలుగు సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు గాదె నర్సింహులు బండ భిక్షపతి, సూరారం రాజు, రచ్చ శివ రక్తదానం చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. జోన్ చైర్మన్ రంగరాజు ప్రవీణ్ కుమార్, ఏనుగు నర్సిరెడ్డి, కార్యదర్శి వి. వేణుగోపాల్ రెడ్డి, కోశాధికారి బండ భిక్షపతి, పూర్వ అధ్యక్షుడు బైరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'క్రైస్తవ మత ప్రచారాన్ని అరికట్టాలి'

జఫర్‌గఢ్: గ్రామాల్లో క్రైస్తవ మత ప్రచారాన్ని అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్ గ్రామంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో హిందువుల ఇళ్లే లక్ష్యంగా ఎలాంటి అనుమతి లేకుండా క్రైస్తవ మత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారన్నారు. దీనిపై అధికారులు చర్య తీసుకోవాలని కోరారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి పల్లె సంతోష్‌రెడ్డి, సీహెచ్ రమేశ్, పోతోజ్ ఏళ్లచారి, రాకేష్, అభిరామ్, అజయ్, శివ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి'

కొడకండ్ల: సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు

సంక్షిప్త సమాచారం

చేసేలా సహకరించాలని, రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ కోసం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్, రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్‌అక్తర్‌ను ఎస్సీ ఫెడరేషన్ న్యాయవాదులు కలిసి వినతిపత్రం సమర్పించారు. మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీరదాస్ వెంకటరత్నం ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో చైర్మన్‌ను కలిసి ఎస్సీ వర్గీకరణపై వినతిపత్రం అందజేశారు. మాదిగ లాయర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల వీరేష్, అంజయ్య, జైపాల్ ఉన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవోపేతంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్ పాల్గొన్నారు.


ఎస్సైకి సత్కారం

రఘునాథపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కందుకూరి సోనిని మంగళవారం వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నగేష్, భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ముగళ్ల కృష్ణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

నివాళి

కొడకండ్ల/పాలకుర్తి: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు నిరుపేద కుటుంబాలకు చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో మృతి చెందిన జవ్వాజి వరకుమార్ మృత దేహానికి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మొండ్రాయిలో దొపాటి యాదమ్మ, కొండయ్య, మల్లబోయిన అనీల్, రామవరంలో లక్ష్మి, శ్రీకాంత్, ప్రశాంత్‌ల కుటుంబసభ్యులను దయాకర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, రాము, సోమరాములు, జ్యోతి, సతీష్‌గౌడ్, షన్నా, మల్లేష్, రణధీర్ ఉన్నారు. అలాగే పాలకుర్తి మండలంలోని విస్నూరు గ్రామానికి చెందిన మల్లారెడ్డి దశదిన కర్మకు దయాకర్ రావు హాజరై నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, సొసైటీ వైస్ చైర్మన్ కారుపోతుల వేణు, గణేష్ ఉన్నారు.

'హామీల అమలులో విఫలం'



బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. వచ్చే జమిలి ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, దేవరాయ ఎల్లయ్య, దొంతుల చెంద్రమౌళి, కూరెళ్ల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పాలకుర్తి టౌన్: బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి, మండల రిటర్నింగ్ అధికారి దుబ్బ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో బూత్ కమిటీల పునర్నిర్మాణంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

చిల్పూరు: ఫత్తేపూర్ గ్రామంలో మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని పీఎం జనరిక్ మెడికల్ షాపు ఆధ్వర్యంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, 85 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నరేష్, భరత్, రాగచందన, మనోజ్ఞ, సంపత్, టీంలీడరు జయరాజు, స్వామి, సామెల్, సుబ్బరాజు, నిర్వాహకులు ప్రసాద్, పాండు, మోతీలాల్, ఆనంద్, అరవిందు, రాజేష్ పాల్గొన్నారు.

పరామర్శ

చిల్పూరు: ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాడిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామ మాజీ ఎంపీటీసీ సాదం సత్తయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, కృష్ణారెడ్డి, జనగామ యాదగిరి, సాదం నర్సింహులు తదితరులు మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్థికసాయం

మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన మొగిళి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్న వెంకటేష్ రూ. 2వేలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి సాంబయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3వేల సాయం అందజేశారు.

చేయూత

పాలకుర్తి: మండలంలోని బమ్మెర గ్రామంలో ఇటీవల దేవసాని రామకృష్ణ మృతి చెందాడు. కాగా మంగళవారం పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాచర్ల సారయ్య, సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేల సాయం చేసి చేయూతనందించారు. మాచర్ల పుల్లయ్య, శ్రీరాం సుధాకర్, సుధాకర్, రాజు, నరేశ్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- పోలీసులకు చిక్కిన నలుగురు.. ఇద్దరు పరారీ
- రూ 20 వేల నగదు, కారు, స్కూటీ, సెల్‌ఫోన్లు స్వాధీనం



పేకాటరాయుళ్ల అరెస్ట్ చూపుతున్న ఎస్సై నరేశ్

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ మంగళవారం తెలిపారు. ఫతేషాపూర్ శివారులోని చౌడారం వెళ్లే రోడ్డులో తోకల వెంకట్‌రెడ్డి కోళ్ల ఫారం వద్ద ఆరుగురు వ్యక్తులు అందర్‌బాహర్ ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు వెళ్లారు. వాహనాన్ని చూసి నోముల నరసింహులు, బల్విందర్‌సింగ్ పారిపోయారు. కేమిడి సుధాకర్, కత్తెర శాల దయాకర్, మహిపాల్, నీల శ్రీనివాస్‌లు పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుంచి రూ 20 వేల నగదు, ఎర్టికా కారు, స్కూటీ, మూడు సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో గుట్కా విక్రయాలు, గంజాయి సమాచారం, పేకాట, రేషన్ బియ్యం దందా, నకిలీ సరుకుల అమ్మకం, కొత్త వ్యక్తుల సంచారం, దొంగల వివరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ప్రజల దృష్టికి వస్తే నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వివరాలు తెల్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు.

నేడు వేదలో స్వర్ణ ప్రాశన

జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు ఏకశిల బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న వేద ఆయుర్వేదిక్ పంచకర్మ వెల్ నెస్ సెంటర్‌లో నేడు (బుధవారం) 0 నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలకు ఉచితంగా స్వర్ణ ప్రాశన వేయనున్నట్లు డాక్టర్ అంజిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల వరకు స్వర్ణ ప్రాశన వేస్తామన్నారు. దీంతో ఇమ్యునిటీ, జ్ఞాపక శక్తి, మేథస్సు, పిల్లల ఎదుగుదల, జీర్ణ ప్రక్రియ, తరచూ వచ్చే ఇన్‌ఫెక్షన్లు, కండరాలు, ఎముకల ధృడత్వం, మానసిక ప్రశాంతత తదితర వాటికి ఇది చక్కగా ఉపయోగపడుతుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్ జైలులో మెడికల్ క్యాంపు



జనగామ రూరల్: సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సబ్ జైల్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలకు ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు రక్త పరీక్ష, బీపీ, షుగర్ టెస్టులు చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కృష్ణకాంత్, డాక్టర్ ప్రవీణ్, ఎం. రవీంద్ర, ఆర్. శ్రీహరి, జోస్న్య, తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

కౌన్సిలర్ అనిత



సర్వేలో పాల్గొన్న అధికారులు, నాయకులు

జనగామ రూరల్: పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కౌన్సిలర్ జక్కుల అనిత వేణు మాధవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 17వ వార్డులో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు తెలుసుకునేందుకు కమిటీ సభ్యులతో కలిసి సర్వే నిర్వహించారు. వార్డు స్పెషల్ అధికారి శ్రీకాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కమాలుద్దీన్, పిట్టల సతీష్, బెజడి కేశవులు, కందుల చంద్రకళ, స్వప్న పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: వసతి గృహాల్లో కొత్త మోను అమలుపై టీఎన్‌జీఓస్ యూనియన్ నాయకులు మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో కొత్త మెనూ అమలుపై జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజా షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలతో మూడు స్లాబ్ రేట్లకు ఒక్కటే కామన్ మెనూ ఇచ్చి ఎలా అమలు చేయాలో తెలుపలేదని అన్నారు. కొత్త మెనూ అమలులో ఏర్పడే ఇబ్బందులపై వసతిగృహ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.